నామా వినోద్‌పై దాడి చేసిన భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

సర్వేను జీర్ణించుకోలేకే కక్షపూరితంగా నామా వినోద్‌పై దాడి

కొత్తగూడెం కార్పొరేషన్ సిపిఐ పక్ష మహిళా ప్రతినిధి పద్మ

తొలిసమయం, కొత్తగూడెం, జూన్ 06 :
నామా వినోద్‌పై దాడి చేసినవారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవడంతోనే కక్షకట్టి ఈ దాడికి పాల్పడ్డారని కొత్తగూడెం కార్పొరేషన్ సిపిఐ పక్ష మహిళా ప్రతినిధి పద్మ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శేషగిరిభవన్లో ఆమె మాట్లాడారు. పాల్వంచ సీతారాంపట్నం 35వ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాన్ని ప్రజల ఉపయోగార్థం ప్రీ-ప్రైమరీ హెల్త్ సెంటర్, అంగన్వాడీ సెంటర్, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించాలని ప్రజల తరపున తాము అధికారులను కోరామని ఆమె తెలిపారు. ప్రజా అవసరాల నిమిత్తం స్థానిక తహసీల్దార్ ఈ భూమిని అధికారికంగా సర్వే కూడా చేశారని ఆమె గుర్తుచేశారు. అయితే ఈ విషయాన్ని జీర్ణించుకోలేక, ఎలాగైనా భూమిని కబ్జా చేయాలనే దురుద్దేశంతోనే 35వ డివిజన్ కార్పొరేటర్ భర్త నామా వినోద్‌పై కొందరు భూకబ్జాదారులు అత్యంత అమానుషంగా దాడి చేశారని ఆమె మండిపడ్డారు. సమాజంలో ఇలాంటి అరాచక శక్తుల ఆగడాలను ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ దాడి ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు అత్యంత కఠినంగా వ్యవహరించి, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నామా కీర్తి, పగడాల ఆకాంక్ష, నూనావత్ శ్యామల, మద్దాల హరిత, యూసుఫ్, బండి నర్సింహా, బోయిన విజయ్, పొలమూరు ధనలక్ష్మి, గుర్రం వెంకటేశ్వర్ రావు, సింధు తపస్వి తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

- 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో

నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్య

ఆర్టిసి బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి

తగిన చర్యలురాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

రామకృష్ణారావు

తొలి సమయం మహబూబాబాద్ జూన్ 6

మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. శనివారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన వడ్లు వెనువెంటనే లారీల్లో మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా చూడాలని సూచించారు. జూన్ 9వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమంజిల్లాల్లోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4 గంటల లోపల హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌కి చేరుకునే విధంగా చూడాలని సూచించారు. మహిళలకు మార్గమధ్యలో భోజనాలు, తాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. యోగా డేను నిర్వహించాలని, పిల్లలకు యూనిఫాంలు త్వరగా కుట్టించాలని, సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీఎస్ఓ రమేష్, డీఎం సివిల్ సప్లై నరసింహారావు, ఇంటర్మీడియట్ అధికారి మదర్,ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గోధుమవాగు బ్రిడ్జి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి

- ఎంపీకి ఆర్ఆర్ఆర్‌కు కార్పొరేటర్

ఆకునూరి సుప్రియ వినతి

తొలిసమయం, కొత్తగూడెం, జూన్ 06 :
రామవరం కొత్తగూడెంను కలిపే జాతీయ రహదారి (ఎన్. హెచ్ -30) పై ఉన్న గోధుమవాగు బ్రిడ్జి చిన్న వర్షానికే గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతోందని, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గాయపడినట్లు ఆమె ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి ప్రజలకు సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్పొరేటర్ వినతిపైస్పందించినఎంపీరామ సహాయం రఘురామ రెడ్డి వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభం కాక ముందే సంబంధిత అధికారులతో మాట్లాడి బ్రిడ్జికి అవసర మైన మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎంపీకికార్పొరేటర్ఆకునూరిసుప్రియకృతజ్ఞతలు తెలిపారు.

కొత్తగూడలో దొంగల బీభత్సం

- బ్యాంకు నుంచి వచ్చే మహిళలే లక్ష్యం..

- బంగారం అపహరణతో కలకలం

తొలి సమయం కొత్తగూడ 06 జూన్ 2026

కొత్తగూడ మండల కేంద్రంలోని ఇండియన్ బ్యాంకు పరిసరాల్లో దొంగల ముఠా సంచరిస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకుకు వచ్చే మహిళలను లక్ష్యంగా చేసుకుని పథకం ప్రకారం చోరీలకు పాల్పడుతున్న ఘటనలు వరుసగా చోటుచేసుకోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. పొగళ్లపల్లి శివారు బోరింగ్ తండాకు చెందిన భూక్యా మౌనిక బ్యాంకులో తన బంగారాన్ని విడిపించుకుని బయటకు వచ్చారు. అనంతరం మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసిన ఆమె, కుమారుడు కూల్‌డ్రింక్ అడగడంతో పర్సులో నుంచి డబ్బులు తీసి ఇచ్చారు. తర్వాత మిగిలిన నగదును పర్సులోనే భద్రపరుచుకుని ఓటాయి వెళ్లే బస్సు ఎక్కేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బస్సు వద్ద ఉన్న రద్దీని ఆసరాగా చేసుకున్న గుర్తుతెలియని దుండగులు ఆమె పర్సును అపహరించారు. పర్సులో సుమారు మూడు తులాల పుస్తెలతాడు, ఒక తులం బంగారు కమ్మలు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. విషయం గుర్తించిన మౌనిక కన్నీరు మున్నీరుగా విలపించగా, అప్రమత్తమైన బస్సు డ్రైవర్ గ్రామ శివారులో బస్సును నిలిపి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని తనిఖీలు నిర్వహించినప్పటికీ ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఘటనకు ముందు బ్యాంకు ఆవరణలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ, బాధితురాలి కదలికలను గమనిస్తూ సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీసినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ఈ చోరీ ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే బ్యాంకులో ఇటీవల ఓ మహిళ నగదు డ్రా చేసుకుని బయటకు వచ్చిన సమయంలో ఆమె వద్ద ఉన్న కవరును కత్తిరించి రూ. 30 వేల నగదు అపహరించిన ఘటన మరువక ముందే మరోసారి బంగారం చోరీ జరగడం స్థానికంగా కలకలం రేపుతోంది. పిల్లలతో ఒంటరిగా వచ్చే మహిళలనే లక్ష్యంగా చేసుకుంటున్న ఈ ముఠాను వెంటనే గుర్తించి పట్టుకోవాలని, బ్యాంకు పరిసరాల్లో పోలీసు నిఘాను పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బ్యాంకు వద్ద సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను త్వరగా అరెస్టు చేయాలని కోరుతున్నారు.

ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా జాగ్రత్త పడాలి

- జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్

గంజాయి రహిత మండలం లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు

తొలి సమయం మహబూబాబాద్, జూన్ 06 :
జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) శ్రీ శబరిష్ నాయ కత్వంలో జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేం దుకు పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. గంజాయి వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు మరియు చట్ట పరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గంజాయి వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులకు ప్రత్యేక టెస్ట్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించబడుతున్నాయ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సిలింగ్ అందించి, మత్తు పదార్థాల బానిసత్వం నుండి బయటపడేందుకు అవసరమైన సహాయం మరి యు మార్గదర్శకత్వం కల్పించబడుతోంది. అయితే, కౌన్సిలింగ్ అనంతరం కూడా తమ ప్రవర్తన లో మార్పు తీసుకురాకుండా గంజాయి వినియోగాన్ని కొనసాగించే వ్యక్తులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోబడతాయి. అదేవిధంగా, వ్యక్తిగత లేదా ఇతర కార ణాల వల్ల గంజాయి అలవాటుకు బానిసలైన వారు స్వచ్ఛందంగా పోలీసు శాఖను సంప్రదిం చినట్లయితే, వారికి తగిన కౌన్సిలింగ్, వైద్య సహాయం మరియు సరైన మార్గనిర్దేశం సూచించి ఆ అలవాటు నుండి దూరం చేయడానికి పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుంది. గంజాయి విక్రయం, రవాణా, నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన ఏదైనా సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే, వారు టోల్ ఫ్రీ నంబర్ 87126 56999 కు సమాచారం అందించవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. ఉపయోగకరమైన సమాచారం అందించిన వారికి నగదు బహుమతి కూడా అందజేయబడుతుంది.

పీవీకే-5 గని ఉన్నతాధికారుల వేధింపులతోనే అప్రెంటిస్ యువతి వసుమతి ఆత్మహత్య

మృతి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెం ఏరియా జీఎంకు వినతిపత్రం

అందజేసిన గిరిజన సంఘ నాయకులు

తొలిసమయం, కొత్తగూడెం, జూన్ 06 :
సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పీవీకే-5 ఇంక్లైన్ గనిలో అప్రెంటిస్‌గా పనిచేస్తున్న గిరిజన యువతి వసుమతి (23) మృతి చెందడం అత్యంత బాధాకరమని గిరిజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజుకు వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. వసుమతి పురుగుల మందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం తీవ్ర విషాదకరమని పేర్కొంటూ, ఆమె కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వసుమతి మృతికి గనిలోని కొందరు అధికారుల వేధింపులే కారణమన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించాలనే ఆశయంతో అప్రెంటిస్‌గా చేరిన వసుమతి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను పూర్తిస్థాయిలో విచారించాలని కోరారు. వేధింపులకు పాల్పడినట్లు తేలిన అధికారులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారిని కాపాడే ప్రయత్నంలో ఓ చిరుద్యోగిని బలి చేయరాదని స్పష్టం చేశారు. వసుమతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని గిరిజన సంఘాల నాయకులు హెచ్చరించారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే వసుమతి కుటుంబ సభ్యులతో కలిసి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ముఖ్య నాగేశ్వరరావు, సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీ ఏ. భాస్కరరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ భూక్య వెంకట్రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి. రాందాస్, లైజన్ ఆఫీసర్ జర్పుల లింగా, భూక్య భీముడు, బి. రమేష్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ భూక్య తౌర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం బడిబాటలో భాగంగా నూతన అడ్మిషన్

తొలి సమయం మహబూబాబాద్ జూన్ 6:
ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, నాణ్యమైన విద్యను ప్రతి చిన్నారికి అందించాలనే లక్ష్యంతో కురవి మండలంలోని బలపాల గ్రామ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కురవి మండల అభివృద్ధి అధికారి () వీరబాబు పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వీరబాబు సమక్షంలో పాఠశాల ప్రీ-ప్రైమరీ విభాగంలో నూతన అడ్మిషన్లు పొందినట్లు ప్రధానోపాధ్యాయురాలు తేలుకుంట్ల సునీత తెలిపారు. గ్రామంలోని ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఉత్తమ విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాదావత్ బిక్కు నాయక్, గ్రామ కార్యదర్శి విక్రమ్, వార్డు సభ్యులు పి. మోహన్ రావు, సి. హెచ్. మోహన్, ఎం. రమ, బి. రమ, గ్రామ ప్రముఖులు అంబటి వెంకటనారాయణ, బత్తుల రామకృష్ణ, గొంతేటి వెంకన్న శ్రీనివాస్, మానస, ఉపాధ్యాయులు వి. జ్యోతి, జి. వినోద్ కుమార్ పాల్గొన్నారు. పిల్లల్ని చేర్పించే బాధ్యత మీది బోధనా బాధ్యత మాది అనే నినాదంతో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నట్లు ఉపాధ్యాయ బృందం తెలిపింది.

శాస్త్రీయ పద్ధతులను ద్వారా అధిక దిగుబడులు పొందాలి

తొలి సమయం కొత్తగూడ 06 జూన్ 2026

గూడూరు మండలం పడమటి తండాలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పలు కీలక వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ సూచించారు. గ్రామసభలో "ఖేత్ బచావో అభియాన్", వరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాలు, నానో యూరియా ప్రయోజనాలు, పంట మార్పిడి విధానం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ, ఒకే భూమిలో ప్రతి సీజన్‌కు వేర్వేరు పంటలను సాగు చేయడం ద్వారా నేల సారవంతం పెరగడంతో పాటు పురుగులు, వ్యాధుల ప్రభావం తగ్గుతుందని తెలిపారు. పంట మార్పిడి వల్ల ఎరువుల ఖర్చు తగ్గడం, నీటి వినియోగం సమర్థవంతంగా ఉండడం, రైతులకు ఆర్థిక భద్రత కలగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. అలాగే వరి కొయ్యలను కాల్చడం వల్ల గాలి కాలుష్యం పెరగడం, నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులు నాశనం కావడం, అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటం, వాతావరణ మార్పులకు దోహదపడటం వంటి దుష్పరిణామాలను వివరించారు. రైతులు వరి కొయ్యలను కాల్చకుండా నేలలో కలపడం, పశువుల మేతగా వినియోగించడం, బయోగ్యాస్ తయారీకి ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని సూచించారు. నానో యూరియా వినియోగం ద్వారా రసాయన యూరియా వాడకాన్ని తగ్గించి, పంటల ఉత్పాదకతను పెంచుకోవచ్చని అధికారులు రైతులకు వివరించారు. భవిష్యత్తులో రైతులు నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పడమటి తండా గ్రామ సర్పంచ్ భాస్కర్, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ, గ్రామ రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి () సుస్మిత, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.